పిఆర్‌సి కోసం ఎదురుచూపులు

- వేతనాలూ సక్రమంగా అందవు
- ఉపాధి హామీ సిబ్బంది దీన పరిస్థితి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే అందులో పని చేసే సిబ్బందికి వేతన వెతలు తప్పడం లేదు. ఉపాధి హామీ సిబ్బంది పిఆర్‌సి కోసం ఎదురు చూస్తున్నారు. దానికి తోడు వేతనాలు కూడా సక్రమంగా అందడం లేదు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా 548 మంది ఎపిఒలు, 11 మంది అడిషనల్ డిఆర్‌బిలు, 29 మంది కోర్సు డైరెక్టర్లు, 1406 మంది కంప్యూటర్ ఆపరేటరు, 238 మంది ఈసీలు, 183 మంది జెఇలు, 14 మంది డిబిటి, ఇతర 23 క్యాడర్లతో 6149 పని చేస్తున్నారు. అదనపు ప్రోగ్రాం అధికారి (ఎపిఒ) ఉపాధి హామీ పథకాన్ని మండల స్థాయిలో పర్యవేక్షించే అధికారిగా ఉంటారు. అదనపు డిస్టిక్ రిసోర్స్ పర్సన్స్ సాఫ్ట్వేర్ సంబంధిత పర్యవేక్షణ చూస్తారు. కోర్సు డైరెక్టర్లు శిక్షణలో ఇస్తుంటారు. కంప్యూటర్ ఆపరేటర్లు పని చేసిన డాటా ఎంట్రీ చేయటం వంటి పనులు చేస్తుంటారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్, జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉపాధి పనులు పర్యవేక్షిస్తారు. సాంకేతిక సహాయకులు పనులు గుర్తింపు, కొలతలు చేస్తారు. ఉపాధి హామీ సిబ్బందికి గతంలో 2014లో పదో పిఆర్‌సిని అమలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు 11వ పిఆర్‌సిని ప్రకటించారు. పంచాయతీ రాజ్ శాఖ కింద ఉన్న డిఆర్‌డిఎలో పని చేసే సిబ్బందికి డిసెంబర్‌లో 11వ పిఆర్‌సిని అమలు చేస్తున్నారు. ఆ 11వ పిఆర్‌సి అదే పంచాయతీ రాజ్ శాఖ కిందే ఉన్న ఉపాధి హామీ సిబ్బందికి అమలు కావడం లేదు. అందుకు పలు నిబంధనలు అడ్డువస్తుండటంతో పాటు పిఆర్‌సి అమలుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఉపాధి హామీకి ఖర్చు చేస్తున్న నిధుల్లో 6 శాతం మాత్రమే ఉద్యోగుల వేతనాల కోసం ఉపయోగించుకునేందుకు వీలుంటుంది. పిఆర్‌సి అమలు చేస్తే బడ్జెట్ సరిపోదన్న కారణంతో పిఆర్‌సిని అమలు చేయడం లేదు. దీంతో 11వ పిఆర్‌సి కోసం ఉపాధి హామీ సిబ్బంది ఎదురుచూస్తున్నారు.

పిఆర్‌సిని అమలు చేయాలి

ఉపాధి హామీ సిబ్బంది పిఆర్‌సి కోసం ఆశతో ఎదురుచూస్తున్నాం. పై అధికారులు మాతో పని చేయించడమే కాకుండా మాకు, మా పిల్లలకు కూడు, గూడు, గుడ్డ ఆరోగ్యం వంటి సదుపాయాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటారని జాలిగా ఎదురు చూపులు తప్పడం లేదు. పక్కనున్న శాఖలకు జీతాలు పెరుగుదల అయినప్పుడు మాకు అవుతాయని ఆశిస్తున్నా మాకు నిరాశే ఎదురవుతోంది. అధికారులు ఇప్పటికైనా మా కష్టాలను గుర్తించి 11వ పిఆర్‌సిని ప్రకటించాలని కోరుతున్నాము.

- పి.మధుబాబు,
ఎపిఒల సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షులు.

దానికి తోడు వేతనాలు కూడా సరైన సమయానికి అందడం లేదు. ఈ నెల వేతనం 22వ తేదీన ఖాతాల్లో జమ చేశారు. వేతనాలు సరైన సమయంలో చెల్లించకపోవడంతో ఉపాధి సిబ్బంది ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఇఎంఐలు, వైద్య ఖర్చులు, ఇతర ఖర్చుల కోసం సిబ్బంది అప్పులు చేయాల్సి వస్తోంది. వేతనం పడే వరకూ తీసుకున్న అప్పుకు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది.

ఆదోని మండలం జి.హొసల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

పదిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తాం

- 162 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన
- ప్రజాశక్తితో జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ వెల్లడించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందు లేకుండా తగు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ కర్నూలు జిల్లాలో టెన్త్ పరీక్షల నిర్వహణ, ఉత్తమ ఫలితాల సాధనకు తీసుకుంటున్న చర్యలపై ప్రజాశక్తికి ముఖాముఖిలో వివరించారు.

కర్నూలు జిల్లాలో పదో తరగతి పరీక్షలకు ఎంత మంది విద్యార్థులు హాజరు కానున్నారు?

డిఇఒ : జిల్లాలో మొత్తం 489 పాఠశాలలకు చెందిన 37090 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు 142 పరీక్షా కేంద్రాలను గుర్తించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం.

జిల్లాలో పది పరీక్షల నిర్వహణకు తీసుకున్న ఏర్పాట్లు ఏమిటి?

డిఇఒ : పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ ఇటీవలనే అన్ని శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. ఈ పరీక్ష నిర్వహణలో ఎ, బి, సి విభాగాలుగా పరీక్షా కేంద్రాలను విభజించాం. పోలీస్ స్టేషనులకు అనుగుణంగా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. 44 జోన్లను కూడా ఏర్పాటు చేశాం. 162 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, 11 మందిని కస్టోడియన్ అధికారులను నియమించాం. 1,553 మంది ఇన్విజిలేటర్లను నియమించాం.

పరీక్షల్లో మాస్ కాపీయింగ్ చోటు చేసుకోకుండా ఎలాంటి చర్యలు చేపట్టారు?

డిఇఒ : పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా పక్కాగా చర్యలు తీసుకుంటున్నాం. స్క్వాడ్లను ఏర్పాటు చేశాం. జిల్లాలో 8 పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రా లుగా గుర్తించగా వీటిలో సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయనున్నాం. ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులు మాస్ కాపీయింగుకు పాల్పడకుండా కఠినంగా చర్యలు తీసుకుంటున్నాం. అక్కడ ఏవైనా పొరపాట్లు జరిగితే సంబంధిత నిర్వహణ అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన పూర్తి అయిందా ?

డిఇఒ : ఇప్పటికే పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన సిలబస్ పూర్తి కావడమే కాకుండా అన్ని రకాల రివిజన్, ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. సిలబస్‌ను మాత్రం సకాలంలో పూర్తి చేయడం జరిగింది.

ఉత్తమ ఫలితాల సాధనకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

డిఇఒ : ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధనకు అనేక చర్యలు చేపట్టడం జరిగింది. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా శిక్షణా తరగతులను ఇప్పించడం..అలాగే ప్రత్యేకంగా స్టడీ అవర్స్ కూడా ఏర్పాటు చేశాం. అన్ని పాఠశాలల్లో ఈ ఏడాది నూటికి నూరు శాతం ఉత్తీర్ణత శాతం ఉండేలా చర్యలు చేపట్టాం.

మెరుగైన వైద్య సేవలు అందించండి : కలెక్టర్

క్రిటికల్ కేర్ బ్లాక్‌కు వర్చ్‌వల్‌గా ప్రధాని నరేంద్రమోడి శంకుస్థాపన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

క్రిటికల్ కేర్ బ్లాక్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌లో భాగంగా దేశంలోని పలు ఎయిమ్స్ వైద్య కళాశాలను జాతికి అంకితం చేయడంతో పాటు వివిధ ప్రభుత్వ ఆసుపత్రులలో శంకుస్థాపనలలో భాగంగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణంలో రూ.23.75 కోట్లతో నిర్మించనున్న 50 బెడ్స్ క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుజరాత్ రాష్ట్ర రాజ్ కోట్ నుండి వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేశారు. ఆదివారం కర్నూలు వైద్య కళాశాలలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌లో భాగంగా కర్నూలు సర్వజన ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో రూ.23.75 కోట్లతో నిర్మించనున్న 50 బెడ్స్ క్రిటికల్ కేర్ బ్లాక్‌ను గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేశారన్నారు. ఈ క్రిటికల్ కేర్ బ్లాక్ ద్వారా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో వచ్చేవారికి తక్షణ మెరుగైన ఆరోగ్య సేవలు అందజేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యానికి పెద్దపీట వేశాయని, ప్రస్తుతం మన ప్రభుత్వ సర్వజన వైద్యశాల రాయలసీమలోనే మెరుగైన వైద్య చికిత్సలు అందించడంలో ముందంజలో ఉందన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ గతంలో కరోనా సమయంలో అత్యవసర వార్డులు తక్కువగా ఉన్నందున రోగులు ఇబ్బందిపడిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మెరుగైన వైద్య సదుపాయం అందజేయడానికి క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటు కొరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారన్నారు. దీని ద్వారా రోగులకు పూర్తి స్థాయిలో సేవలు అందజేస్తారన్నారు. అనంతరం క్రిటికల్ కేర్ బ్లాక్‌కు సంబంధించి ఫైలాన్‌ను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, వైద్యాధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డా రామగిడ్డయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి, ఎపిఎంఎస ఐడిసి ఎస్ఇ రమేష్ రెడ్డి, ఇఇ శివకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శిలా ఫలకం ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, డిఎంహెచ్ఒ తదితరులు

ఆశ వర్కర్ల ఉద్యోగ భద్రతకు ఉద్యమం

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపి ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కుపాదంతో నిర్బంధాలతో ఉద్యమాలను అణచివేయటం సిగ్గుచేటని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్ పిలుపునిచ్చారు. ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ ముఖ్య కార్యకర్తల జిల్లా స్థాయి సమావేశం కార్మిక కర్షక భవన్‌లో కాంతమ్మ అధ్యక్షతన నిర్వహించారు. గౌస్ దేశాయ్ మాట్లాడుతూ కొన్ని రాజకీయ పార్టీలు తమ వర్గ ప్రయోజనాల కోసం పనిచేస్తుందన్నారు. మనలాంటి కార్మిక వర్గం ప్రయోజనాల కోసం పనిచేయకుండా ఆటంకాలు సృష్టిస్తూ హక్కులు అడుగుతే నేరం చేసినట్టు కేసులు పెట్టడం అరెస్టు చేయటం నిర్బంధాలు చేయటం జరుగుతున్నదని, అటువంటి ప్రభుత్వాలను, ఆ రాజకీయ పార్టీని ఓటు ఆయుధం ద్వారా తరిమి కొట్టాలన్నారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ 1970లో సిఐటియు పుట్టిందని ఈ దేశంలో ఉన్న కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి కార్మిక వర్గం హక్కుల సాధనకు పోరాడాలని దీర్ఘకాలిక లక్ష్యసాధనకు కార్మిక వర్గం కృషి చేయాలని ఆయన కార్మికులను కోరారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జె .నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా పిహెచ్‌సిలలో కొంతమంది డాక్టర్స్ వెట్టిచాకిరి చేయిస్తున్నారని అన్నారు. అటువంటి సమస్యలను గుర్తించి సమస్యల పరిష్కారం కొరకు ఉద్యమించాలని సూచించారు. సమావేశంలో శోభారాణి, సుభద్రమ్మ, శేషమ్మ, సుబిదాబి ,సుజాత, జ్యోతి, తదితరులు మాట్లాడారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

- 81.93 శాతం హాజరు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 2 ఉద్యోగాలకు సంబంధించిన అర్హత పరీక్ష ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. జిల్లాలో 126 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. మొత్తం ఈ పరీక్షకు 36816 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 30163 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షకు 81.93 శాతం హాజరు నమోదయింది. గ్రూప్ 2 అర్హత పరీక్షను జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి పర్యవేక్షించారు.

పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న గ్రూప్ 2 అభ్యర్థులు

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, ప్రజారోగ్య వేదిక, ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ల ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ నగర్ లోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ప్రతి రెండు నెలలకోసారి నిర్వహించే వైద్య శిబిరానికి జిబిఆర్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో బిపి, షుగర్, పక్షవాతం, ఫిట్స్,(మూర్ఛ) జబ్బులకు డాక్టర్లు మెడికల్ కళాశాల మాజీ సిఎంఒ ఎం. నాగభూషణ్ రావు, ప్రముఖ ఎండో కైనాలజిస్ట్ డి.భరత్, జనరల్ ఫిజీషియన్ లు డాక్టర్ టి.వినోద్, డాక్టర్ సుధాకర్ లు రోగులను పరీక్షించి మందులను ఇచ్చారు. ఈ వైద్య శిబిరంలో మెడికవర్ ఫార్మసిస్ట్ దుర్గ, మెడికల్‌రెప్స్‌ఖలీల్, షేక్షావలి, శాస్త్రి , శంకర్, మధుసూదన్‌లు మందులు పంపిణీ చేశారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం వైస్‌చైర్మన్ బి. రామాంజనేయులు పర్యవేక్షణలో ఆర్గనైజర్లు వై.శిరీష, జెఎన్.శేషయ్య,రంగస్వామి, బసయ్య, సుధాకరప్ప, హుస్సేనయ్యలు తమ సేవలను రోగులకు అందించారు.

డాక్టర్ స్వరూప్ సిన్హాను సత్కరిస్తున్న డాక్టర్ రాజారెడ్డి తదితరులు

తెలుగు కవులకు సత్కారం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తెలుగు కళ్ల సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మాతృభాషా వారోత్సవాల సందర్భంగా తెలుగు కవులను, సాహితీ సేవకులను ఘనంగా సత్కరించారు. కర్నూలు బి క్యాంప్ విశ్రాంత ఉద్యోగుల భవనంలో డాక్టర్ చిన్నావుల వెంకట రాజా రెడ్డి అధ్యక్షతన మాతభాషా పిపాసుల తెలుగు సాహిత్య కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సాహిత్యోపన్యాసాలు , సాహిత్య సేవారత్న డాక్టర్ బివి. స్వరూప్‌సిన్హా రాజా రెడ్డి,తెలుగు అధ్యాపకులు ప్రతాపరెడ్డి, కవి బెల్దోనకృష్ణ మూర్తి, కవితలు వినిపించి ప్రేక్షకులను అలరించారు. సాహితీ సేవకులను డాక్టర్ రాజారెడ్డి ఘనంగా సత్కరించారు.

విజయమే లక్ష్యంగా కష్టపడాలి

జయహో బిసి సభలో వక్తల పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ 45 రోజులలో విజయమే లక్ష్యంగా పెట్టుకొని పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని కర్నూలు జిల్లా టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. కర్నూలు ఎంఆర్‌సి ఫంక్షన్ హాలులో నిర్వహించిన జయహో బిసి మహాసభ కార్యక్రమానికి జిల్లాలోని నియోజకవర్గాల ఇంచార్జీలు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అంటే ముందుగా బిసిలే గుర్తొస్తారన్నారు. బిసిలకు ఎంతో విలువ ఇచ్చే చంద్రబాబు నాయుడు బిసిల కోసం రక్షణ చట్టం తీసుకురాబోతున్నారని తెలిపారు. కర్నూల్లో అత్యధికంగా ఉన్న బిసిలు ఒక ఎంపీ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బిటి నాయుడు, మాజీ ఎమ్మెల్సీ కెఇ ప్రభాకర్ నియోజకవర్గ ఇన్చార్జులు కర్నూలు, కోడుమూరు, పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థులు టిజి భరత్, బొగ్గుల దస్తగిరి, కెఇ. శ్యాంబాబు, జయ నాగేశ్వర్ రెడ్డి, తిక్కారెడ్డి మీనాక్షి నాయుడు, రాష్ట్ర కార్యదర్శి పిజి. నరసింహులు, పిజి. రాం పుల్లయ్య యాదవ్, జడ్‌పి మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, వెంకటరాముడు , సత్రం రామకృష్ణ, తుగ్గలి నాగేంద్ర, కార్పొరేటర్ పరమేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జయహో బిసి సభలో మాట్లాడుతున్న కెఇ.ప్రభాకర్ , వేదికపై తిక్కారెడ్డి, బిటి.నాయుడు

ఎమ్మిగనూరు తెలుగు తమ్ముళ్ల బాహాబాహా

జయహో బిసి సభలో ఎమ్మినూరు టికెట్ బిసిలకు ఇవ్వాలని, మరోగ్రూపు బివి.జయనాగేశ్వరరెడ్డికి ఇవ్వాలని పరస్పరం దాడులకు దిగారు. ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకున్నారు. దీంతో సభకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

మాట్లాడుతున్న హాఫీజ్ ఖాన్‌కు, టికెట్ ఇవ్వాలని అనుచరుల నినాదాలు

అధిష్టానం నుంచి మధ్యవర్తిత్వం

ఎమ్మెల్యే అనుచరులతో రామసుబ్బారెడ్డి సమావేశం

హాఫీజ్ ఖాన్‌కు టికెట్ ఇవ్వాలని నినాదాలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో వైసిపి అభ్యర్థుల ప్రకటనకు పూనుకుంది. ఇటీవలే అధిష్టానం కర్నూలు సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎ.హాఫీజ్ ఖాన్‌కు సీటు లేదంటూ ముఖ్యమంత్రి స్వయంగా పిలుచుకొని చెప్పారట. కొత్తవారికి అవకాశం ఇస్తున్నట్లు తెలిసింది. దీంతో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అనుచరుల్లో తీవ్ర అసంతృప్తి బయలుదేరింది. ఇందులో భాగంగానే ఆయన అనుచరులు 20 మంది కార్పొరేటర్లు నామినేటెడ్ పదవులు పొందిన కార్యకర్తలు తమ పదవులకు రాజీనామా చేసేందుకు శనివారం సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో అధిష్టానం కలుగజేసుకొని వారిని సంప్రదించి తగు నిర్ణయం తీసుకుంటామని చెప్పడంతో ఆ ప్రక్రియ వాయిదా పడింది. సంబంధిత విషయాన్ని చర్చించేందుకు ఆదివారం వైసిపి అధిష్టానం ఆదేశాల మేరకు కర్నూలు రాయల్ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కార్యకర్తలు అనుచరులు ఎమ్మెల్యే టికెట్ తిరిగి హాఫీజ్‌ఖాన్ కేటాయించాలంటూ ఆయన చేసిన వివిధ అభివృద్ధి పనులు, ప్రజలకు చేసిన సేవలకు సంబంధించిన వివరాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సమావేశానికి భారీగా తరలివచ్చిన ఆయన అనుచర వర్గం నినాదాలతో రాయల్ ఫంక్షన్ హాల్ హోరెత్తిపోయింది. ఎలాగైనా ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కే టికెట్‌ను ఇవ్వాలని పట్టుబట్టారు. ఎమ్మెల్యే హాఫీస్ ఖాన్ మాట్లాడుతూ తన గురించి తనకు పెద్దగా ఏమాత్రం బెంగలేదని, జగనన్న ఆదేశిస్తే ఏదైనా చేయడానికి తాను సిద్ధమేనని, తన బాధంతా తనను నమ్ముకున్న కార్యకర్తల గురించేనన్నారు. అందుకు రామ సుబ్బారెడ్డి స్పందిస్తూ కార్యకర్తల ఆకాంక్షలను ఇక్కడి పరిస్థితులను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి మరో మారు చర్చిస్తామని హాఫీస్ ఖాన్‌కు ముఖ్యమంత్రి తగిన న్యాయం చేస్తారని చెప్పారు.

పెట్రోల్ పోసుకొని కార్యకర్త కలకలం

సమావేశ అనంతరం రామసుబ్బారెడ్డి హాఫీస్ ఖాన్ ఇంటిలోకి వెళ్లి చర్చిస్తుండగా అక్కడే ఉన్న హాఫీజ్‌ఖాన్ అనుచరుడు ఒకరు బాటిల్‌తో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. దీంతో ఒక్కసారిగా ఎమ్మెల్యే ఇంటి వద్ద కలకలం రేగింది. స్థానికంగా ఉన్న అనుచరులు అతన్ని నివారించి అడ్డుకున్నారు.

హాఫీజ్ ఖాన్‌కు టికెట్ కోసం పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం చేస్తున్న అభిమాని

జర్నలిస్టు క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకరశర్మ

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ శంకరశర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జర్నలిస్టులకు క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ శంకరశర్మ అన్నారు. అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి జర్నలిస్టు టోర్నమెంటుకు కర్నూలు జిల్లా నుంచి పాల్గొంటున్న జట్టుకు సభ్యులకు డాక్టర్‌శంకరశర్మ సహకారంతో దుస్తులను పంపిణీ చేశారు. ఆదివారం గాయత్రి ఎస్టేట్‌లోని క్లినిక్‌లో జర్నలిస్టులకు ఆయన దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వార్తల బిజీలో ఉండే జర్నలిస్టులకు కాస్త ఉపశమనం కోసం క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరు ఒత్తిడి లేకుండా సమాజంలో ధైర్యంగా వార్త సేకరణ చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జట్టు సభ్యులు మోహన్, శివరాజ్‌కుమార్, వెంకటేష్, ప్రకాష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కూటర్ ర్యాలీలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆల్ ఇండియా కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతుల కనీస మద్దతు చట్టబద్ధత కల్పించాలని, స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలని రైతులు చేస్తున్న ఆందోళనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఐదుగురి రైతుల ప్రాణాలు బలిగొన్న దానికి నిరసనగా ఈనెల 26న జిల్లా వ్యాప్తంగా అన్ని మండల నియోజకవర్గ కేంద్రాల్లో రైతు, కార్మిక సంఘాలు ప్రజాసంఘాలు స్కూటర్‌ర్యాలీలు చేయాలని కోరారు. ఆదివారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం కోరారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప, నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి టి. రామాంజనేయులు , సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, నగర కార్యదర్శి విజయ్, ఎఐయుటియుసి జిల్లా కార్యదర్శి ఎం.నాగన్న, ఐఎఫ్‌టియు రైతు కూలి సంఘం నాయకులు వెంకటేష్ మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతాంగ ఉద్యమ సందర్భంగా రైతుల పండించిన పంటకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని స్వామినాథన్ సిఫారసులు అమలు చేస్తామని హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా హామీ నెరవేర్చునందుకు పంజాబు ,హర్యానా రాష్ట్రాల నుండి ఆందోళనకు దిగారన్నారు. రైతులను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో పోలీసు బలగాలను, మిలిటరీ దళాలని పెట్టి రైతులపై భాష్ప వాయువుల్ని, సౌండ్ బాంబులతో కాల్పులు జరిపి ఐదుగురి రైతులను బలిగొన్నారన్నారు. రైతాంగం సంఘీభావంగా రైతు సంఘాలు కార్మిక సంఘాలు 26న స్కూటర్ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు.

సజావుగా గ్రూప్- 2 స్క్రీనింగ్

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్

ప్రజాశక్తి - ఆదోని

సజావుగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ – 2 స్క్రీనింగ్ పరీక్ష నిర్వహణ జరిగిందని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. ఆదోని కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని డివిజన్లో గ్రూప్ 2 స్క్రీనింగ్ పరీక్ష నిర్వహణ కొరకు ఆదోని 21, ఎమ్మిగనూరు 16, మంత్రాలయం 03 మండలాలలో మొత్తం 40 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యం లోనే ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహి స్తున్న పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, సిసి ఫుటేజ్ పరీక్ష నిర్వహణ, ఏర్పాట్లను పరిశీలిం చారు. ఆయనతోపాటు డిప్యూటీ తాసిల్దార్ రజనీకాంత్ రెడ్డి, సంబంధిత అధికారులు ఉన్నారు.

నోటీసుల జారీ సరికాదు : ఎస్‌టియు

మాట్లాడుతున్న ఎస్‌టియు నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగ జెఎసి ఆధ్వర్యంలో 27న చలో విజయ వాడ కార్యక్రమానికి వెళ్లకుండా నాయకులకు పోలీసుల నోటీసులు జారీ చేయడం సమంజసం కాదని ఎస్టీయు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి సుంకన్న, ఆర్థిక కమిటీ సభ్యుడు బి రామాంజనేయులు అన్నారు. ఆదివారం ఆదోని లోని ఎస్టీయు కార్యాలయంలో మండలం ప్రధాన కార్యదర్శి బి సుధాకర్ బాబు అధ్యక్షతన జరిగిన మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12 సార్లు ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపినా ఫలితం లేదన్నారు. సమస్యలు పరిష్కరించమంటే కాలయాపన చేయడం సరికాదన్నారు. ఉద్యోగులకు వేల కోట్లలో బకాయిలు పెండింగ్ పెట్టి ఉద్యోగులను వేధించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ సమా వేశంలో ఆదోని మండల ఆర్థిక కార్యదర్శి పి షేక్షావలి, మండల గౌరవ అధ్యక్షుడు ఎల్ రామ్మోహన్ రెడ్డి, పి రామాంజనేయులు, బాలాజీ నాయక్, పవన్ కళ్యాణ్, గంగా నాయక్, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

టిడిపితోనే ఉజ్వల భవిష్యత్తు : ఉమ్మి సలీం

సమస్యలు తెలుసుకుంటున్న ఉమ్మి సలీం

ప్రజాశక్తి - ఆదోని

టిడిపితోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుదని, చంద్రబాబు నాయుడు ప్రకటించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గారెంటీ పథకాలపై వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం జరిగిందని టిడిపి మైనార్టీ నాయకులు ఉమ్మి సలీం తెలిపారు. ఆదివారం పట్టణంలోని హవన్నపేట్ కార్వాన్ పేట్ తదితర వార్డులలో ఇంటింటికి వెళ్లి అక్కడ ఉన్న మహిళలతో, వృద్ధులతోను, యువతీ యువకులతోనూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన పథకాలపై వివరించిన్నట్లు ఆయన తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా చంద్రబాబునాయుడు చేపట్టిన అనేక కార్యక్రమాల ఫలితంగా నేడు ప్రజల్లో విశేష స్పందన లభించిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో ఘన విజయం సాధించడం ఖాయమని, అలాగే ఆదోనిలోనూ టిడిపి విజయం ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమ ంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో మహిళలతో, వృద్ధులతోనూ క్విజ్ టైపులో ప్రచారం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

సంఘీభావం తెలిపిన ఆశ వర్కర్ యూనియన్

ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు పి ఈరన్న, ఆశ వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోనిలోని సుందరయ్య భవన్‌లో అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆశా వర్కర్ల సమస్యలను అధికారంలో వచ్చిన 3 నెలలకే రెగ్యులర్ చేస్తానని, సమాన పనికి సమాన వేతనం ఇస్తానని సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని మరిచారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం ఇస్తానని, మెరుగైన జీవోను అమలు చేస్తానని మాట ఇచ్చి అధికారంలో వచ్చిన తరువాత మోహన్ రెడ్డి విస్మరించారన్నారు. చర్చల ద్వారా మినిట్ కాపీలో ఒప్పుకున్న డిమా ండ్లను ఇంతవరకు అమలు కాలేదని అన్నారు. ఇప్ప టికైనా ఈ ప్రభుత్వాలు ఆశ వర్కర్ సమస్యల వెం టనే పరిష్కరించాలని కోరారు. హక్కుల సాధనకై ఆశ వర్కర్లు సమిష్టిగా పోరాటాలకు సన్నద్ధం కావా లన్నారు. ఈ శిక్షణ తరగతులలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు రమంజి, వీరారెడ్డి సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన్న, ఆశా వర్కర్లు నాయకురాలు పత్తికొండ అనిత, నందవరం మండలం శారద, ఆదోని మండలం రాజేశ్వరి,జయ లక్ష్మి, మంత్రాలయం పుష్ప, కోసిగి వెంకటలక్ష్మి, చిప్పగిరి మాధవి, అదేవిధంగా సిఐటియు మండల ఉపాధ్యక్షులు తిక్కప్ప, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వర్గీకరణ కోసం పోరాడుదాం

- 28న ఉమ్మడి కర్నూలు జిల్లా సమావేశం
- విజయవంతం చేయాలి : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - ఆదోని

ఎస్సీల వర్గీకరణ లక్ష్య సాధన కోసం సామాజిక పోరాటాలకు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బండారి గిడ్డయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు గుమ్మల బాలస్వామి మాదిగ పేర్కొన్నారు. ఆదివారం ఆదోనిలోని మున్సిపల్ ఆవ రణలో సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఫిబ్రవరి 28న హాజరవుతున్న ఉమ్మడి కర్నూలు జిల్లాల సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంఎస్పి జిల్లా నాయకులు బండారి హనుమంతు మాదిగ, ఎస్ బాలన్న మాదిగ, పిఎస్ వీరేష్ మాదిగ, ఎస్ నాగప్ప మాదిగ కరపత్రాలను విడుదల చేశారు. ఎమ్మెస్పీ జిల్లా నాయకులు సద్దాం హుస్సేన్, మాదిరి తిమ్మప్ప, మదిరి అంజి, మైనార్టీ నాయకులు నిషార్ బాయ్, జిలాన్ బాష, అంజనప్ప, జగ్గుల నాగరాజు, ఎన్ శంకర్, మద్రి ఆనంద్, నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడిన నాయకులు

టిడిపి గూటికి గుమ్మనూరు వర్గం ?

- మండల కన్వీనర్, జడ్పిటిసి రాజీనామా చేస్తున్నట్లు ప్రచారం- నేడు వెల్లడించే అవకాశం

ప్రజాశక్తి - దేవనకొండ

రామకృష్ణ, జడ్పిటిసి

కప్పట్రాళ్ల మల్లికార్జున

ఆలూరు నియోజకవర్గం నుండి వైసిపి సమన్వయకర్తగా, ఎమ్మెల్యే అభ్యర్థిగా విరూపాక్షిని ప్రకటించడంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గత కొన్ని రోజులుగా దూరంగా ఉంటున్నారు. టిడిపి నుండి అనంతపురం జిల్లా గుంతకల్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి గుమ్మనూరు జయరాం అనుచరులు టిడిపిలోకి చేరుతారని విస్తృత చర్చ నడుస్తోంది. దేవనకొండ మండలంలో గుమ్మనూరు వర్గానికి చెందిన మండల జడ్పిటిసి రామకృష్ణ(కిట్టు), వెలమకూరు వైసిపి నాయకుడు రామచంద్ర, తెర్నేకల్ గ్రామానికి చెందిన నాయకులు మాజీ ఎంపిటిసి చాప ఈరన్న, రాఘవేంద్ర వైసిపికి దూరంగా ఉన్నారు. మండలంలో విరుపాక్షి పర్యటి స్తున్నప్పటికీ కార్యక్ర మాలకు హాజరు కావడం లేదు. వైసిపి దేవనకొండ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున ప్రారంభంలో వైసిపి ఆలూరు నియోజ కవర్గ సమన్వకర్త విరుపాక్షి కార్యక్రమాలకు హాజర వుతూ వైసిపి పార్టీలోనే కొనసాగుతానని చెప్పాడు. అయితే ఇటీవల విరుపాక్షి వైసిపిలోనే మరో వర్గానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తాను పార్టీలో కొనసాగలేనని బాహాటంగా వెల్లడిస్తున్నట్లు అనుచర వర్గాలు ఆరోపిస్తున్నారు. దీంతో వైసిపి మండల కన్వీనర్, మండల జడ్పిటిసిలు రాజీనామా చేయను న్నట్లు సమాచారం. ఈ విషయమై చరవాణిలో వారిని ప్రజాశక్తి ఆదివారం అడుగగా వాస్తవమేనని, సోమవారం విలేకరుల సమావేశంలో రాజీనామాల ప్రకటనపై వెల్లడిస్తామన్నారు. వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల ఎంపిటిసీ, మరికొంతమంది ఎంపిటిసీలు కూడా రాజీనామా చేయనున్నట్లు సమాచారం. గుమ్మనూరు టిడిపి కండువా కప్పున వెంటనే వీరు కూడా టిడిపిలోకి వెళ్లనున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో వైసిపికి మండల ంలో కొంత గండిపడే పరిస్థితులు ఉన్నాయని పలువురు విశ్లేషకులు అనుకుంటున్నారు.

బిజెపికి రోజులు దగ్గర పడ్డాయి : కాంగ్రెస్

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్ర విభజనలో ఇచ్చిన హామీలను విస్మరించిన భారతీయ జనతా పార్టీకి రోజులు దగ్గర పడ్డాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాబురావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాలకృష్ణ స్వామి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడారు. మతోన్మాద బిజెపి రామ నామం దొంగ జపంతో ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో బిజెపి అధికారంలో ఉన్న ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయలే దన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభలో ప్రత్యేక హెూదా తెస్తామని డప్పాలు కొట్టి కేంద్రం ముందు మోకరిల్లారని విమర్శించారు. అమరావతి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చి ఇంత వరకు నెరవేర్చలేదన్నారు. టిడిపి పాలనలో ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ ను వదిలేసి అమరావతి రాజధాని అంటూ కాలం వెళ్లదీశారని జగన్ ఎన్నికల ముందు 25 ఎంపిలను గెలిపిస్తే ప్రత్యేక హెూదా తెచ్చే బాధ్యత, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసే బాధ్యత నాదే అని చెప్పి అధికారంలోకి రాగానే కేసులకు భయపడి అడగడం లేదని విమర్శించారు. రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక హెూదా ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతపురంలో జరుగు న్యాయ సభను విజయవంతం చేయాలని కోరారు.

ఈ న్యాయ నిర్మాణం సభకు ఏఐసిసి జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సిడబ్ల్యుసి మెంబర్స్ రఘువీరారెడ్డి, రాజు, గిడుగు రుద్రరాజు, పల్లంరాజు, మాజీ అధ్యక్షులు మాజీ మంత్రి శైలజ నాథ్, ఏపి కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్ర మానికి నియోజకవర్గం నుండి 30 వాహనాలలో కార్యకర్తలు తరలివస్తున్నారని తెలిపారు. ఈ సమా వేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి భరత్ కుమార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి షేక్ అబ్దుల్ హై, మంత్రాలయం కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాలకష్ణ స్వామి, జాయింట్ సెక్రటరీ మహమ్మద్ హుస్సేన్, పత్తికొండ ఇన్చార్జ్ క్రాంతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని వాసవి కల్యాణ మండపంలో ఆవోప, ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ హైదరా బాద్ వారి సహకారంతో ఎన్నారై కాకబాళ్ నగేష్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. రక్తనాళాల పరీక్ష శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆదోని పట్టణ అవోపా ప్రెసిడెంట్ వంకదారి శ్రీనాథ్ గుప్తా తెలిపారు. వాస్కులర్ వ్యాధి సంబంధించిన 338 మందికి రూ.4,500 విలువైన పరీక్షలు నిర్వహించి పరిష్కార మార్గం సూచించారు. ముఖ్య అతిథులైన టీజీ పాండురంగయ్య శెట్టి, టీజీ తారనాద్, రాచోటి సుధాకర్, డాక్టర్ వికాస్, డాక్టర్ సోమాచారి, శిబిరదాత కాకుబళ్ నగేష్ జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. శ్రీవాసవి కళ్యాణ మండ పం సేవా సమితి సభ్యులకు, వాలంటీర్లకు సెక్రటరీ మిర్యాల శ్రీధర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారు డైమండ్ రఘు, సభ్యులు ఈరన్న శెట్టి, వెంకటేష్, రాజేష్ మహిళా విభాగ్ అధ్యక్ష కార్యదర్శులు సంగీత, మమతాశ్రీ, సభ్యులు హిమ బిందు, గీత, సంతోషి, ప్రసన్న హాజరయ్యారు.

రోగుల ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న వైద్యులు

ఎమ్మెల్యే సీట్లలో ప్రాధాన్యత కల్పించాలి

- 29న ఆదోనిలో ముస్లిం మైనారిటీల గర్జన
- ముస్లిం మైనారిటీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ మహబూబ్బాషా

ప్రజశక్తి - ఆదోని

తెలుగుదేశం జనసేన పార్టీలు శనివారం ప్రకటి ంచిన అభ్యర్థుల తొలి జాబితాలో ముస్లిం మైనా రిటీల పట్ల చిన్నచూపు చూశారని ముస్లిం మైనారిటీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ షేక్ మహ బూబ్ బాషా విమర్శించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ 2024 ఎన్నికలకు సంబంధించి తెలుగు దేశం పార్టీ, జనసేన పార్టీలు పొత్తుకుదురుచుకొని ముస్లిం మైనారిటీలకు తీరని అన్యాయం చేశాయని అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన 94 టిడిపి అభ్యర్థుల జాబితాలో ముస్లిం మైనార్టీలకు కేవలం ఒక్క సీటు మాత్రమే కేటాయించారని, దీనిబట్టి తెలుగుదేశం పార్టీకి ముస్లిం మైనార్టీల పట్ల ఏమాత్రం ప్రేమ ఉందో స్పష్టమవుతోందన్నారు. టిడిపి ప్రకటించిన 94 మంది అభ్యర్థులలో నం ద్యాల జిల్లా నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎండి ఫరూక్ మాత్రమే ఉన్నారని ఆయన అన్నారు. జనసేన పార్టీ, దక్కించుకున్న 24 అసెంబ్లీ సీట్లలో ఐదు అసెంబ్లీ సీట్లను ఆ సామాజిక వర్గానికి చెందిన వారికి కేటాయించారని ఆయన విమర్శించారు. దీనిని బట్టి ముస్లిం మైనారిటీలు తమ సమస్యలను అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించేందుకు టిడిపి, జనసేన పార్టీల నేతలు తగిన ప్రాధాన్యత లేకుండా చేశారన్నారు. అసెంబ్లీ సమావేశంలో తమ వాని వినిపించేందుకుగాను తగిన సంఖ్యాబలం లేని కారణంగా ముస్లిం మైనార్టీలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక మరింత అయోమ య పరిస్థితిలో పడే పరిస్థితి ఉందన్నారు. ఇకనైనా ముస్లిం మైనార్టీలు పార్టీల తీరు పట్ల చైతన్యవం తులై తమ హక్కుల సాధన కోసం అసెంబ్లీ సమావేశాలలో తమ ప్రాతినిధ్యం పెరిగే విధంగా పోరాటం సాగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అందులో భాగంగానే ఈనెల 29వ తేదీన కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో ముస్లిం మైనారిటీల గర్జన వినిపిస్తున్నట్లు షేక్ మహబూబ్ బాషా తెలిపారు. ఈ సభను విజయవంతం చేసేం దుకు ముస్లిం మైనారిటీలంతా కలిసి రావాలన్నారు.

ఆలూరు అభివృద్ధే లక్ష్యం

ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి

ప్రజాశక్తి - హొళగుంద

ఆలూరు నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యం అని వైసిపి ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి అన్నారు. ఆదివారం నాడు ఆయన హెుళగుంద మండలం గజ్జహళ్లి, వంద వాగిలి గ్రా మాలలో పర్యటించి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో గ్రామ సీమల రూపు రేఖలు మారాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను రూపొందించి వివిధ రకాల ప్రభుత్వ సేవలను ఇంటి వద్దకే సిఎం జగన్ తీసుకువచ్చారన్నారు. మీరు 50 రోజులు కష్టపడండి నేను ఐదు సంవత్సరాలు మీకు సేవ చేస్తా అని అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి, మీ ఇంటి బిడ్డగా భావించి తనకు ఆశీస్సులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ షఫీఉల్లా, జడ్పీటీసీ బావ శేషప్ప, సింగిల్ విండో అధ్యక్షులు మల్లికార్జున. ఎంపీపీ తనయుడు ఇషా, జేసీయస్ మండల ఇంచార్జ్ మల్లికార్జున, నాయకులు మాజీ సర్పంచ్ భీమలింగప్ప,వైస్ ఎంపీపీ కేంచప్ప, సచివా లయం కన్వీనర్ దస్తగిరి, హిమాం ఊసేని నాయ కులు హచ్చోల్లి గర్జప్ప, శీనప్ప,బజారి మూకయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్ లు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్స్, సచివా లయం కన్వీనర్స్, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.


విరుపాక్షికి స్వాగతం పలుకుతున్న హెుళగుంద మండల వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు

ఆలూరు విలేకరికి పితృవియోగం

ప్రజాశక్తి - ఆస్పరి

దేవన్న (ఫైల్ ఫోటో)

ఆలూరు ప్రజాశక్తి విలేకరి క్రిష్ణ తండ్రి దేవన్న (70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. ఆయన కర్నూలు రాయలసీమ పేపర్ మిల్లులో కార్మికుడిగా పనిచేశాడు. సిఐటియులో క్రియా శీలకంగా ఉన్నారు. ఆయన మృతి పట్ల ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ, డేస్క్ ఇంచార్జ్ చంద్రయ్య, జిల్లా ఇన్చార్జ్ రాజు, ఆదోని డివిజన్ ఇంచార్జ్ చంద్రశేఖర్,ఆలూరు తాలూకా ప్రజాశక్తి విలేకరులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

తాగునీటి కోసం వినియోగించుకోవాలి : ఎఇ

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర దిగువ కాలువ నీరు తాగునీటి కోసం వినియోగించుకోవాలని ఎల్ఐసి ఏఈ రంగ స్వామి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం నుండి దిగువ కాలువకు నీరు విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ నీరు కర్నూలు జిల్లా ప్రజల కోసం తాగునీటి నిమిత్తం సరఫరా చేయడం జరిగిందన్నారు. దిగువ కాలువ పరిధిలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు నీరును నిల్వ చేసుకోవాలని కోరారు. తాగునీటికి కోసం నీరు రావడం జరిగిందని రైతులు గమనించాల న్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, ఆయా గ్రామ సర్పం చులు గ్రామ పరిధిలోని నీటి పథకాలకు నీరును నిలువ చేసుకోవాలని కోరారు. మార్చి పదవ తేదీ వరకు నీరు సరఫరా అవుతుందని అందరూ గమనించాలని సూచించారు.

సోదాలు చేస్తున్న మంత్రాలయం ఎస్ఐ

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం, మాధవరం ఎస్సై లు కె. గోపినాథ్, జి. కృష్ణమూర్తి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆదివారం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కొండాపురం శ్రీ అభయాంజనేయస్వామి 48 అడుగుల శిలా విగ్రహం వద్ద మంత్రాలయం ఎస్సై గోపినాథ్ వాహనాల తనిఖీలు చేపట్టగా, మాధవరం ఎస్సై కృష్ణమూర్తి చెక్‌పోస్టు సమీపంలో తనిఖీలు నిర్వహించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వాహనాలను నిలిపి వేసి సోదాలు చేశారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి రికార్డులు సరిగా లేని వాటికి జరిమానాలు వేశారు.

ముగిసిన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండల పరిధిలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో గత వారం రోజులపాటు కొనసాగిన శ్రీ కొలుట్ల చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆది వారం స్వామి వారికి చక్ర స్నానం, వసంతోత్సవం తో ముగిసింది. ఈ ఉత్సవాలు ఆలయ కార్యనిర్వ హణాధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీదేవి, భూదేవి సమేతంగా కౌలుట్ల చెన్నకేశవ స్వామీ చక్ర స్నానం అనంతరం సాయంత్రం కొండ నుండి తీసుకొని పి. కోటకొండ గ్రామంలో పల్లకి సేవతో బ్రహ్మోత్స వాలు పూర్తయ్యాయి. త్రాగు నీటి సమస్య లేకుండా మూడుట్యాంకర్లను మండల వైఎస్సార్సీపీ నాయకులు తువ్వదొడ్డి ప్రేమ నాథ రెడ్డి, మరో ట్యంకర్ వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ కప్ప ట్రాల మల్లికార్జున ఏర్పాటు చేశారు. **స్వామివారి హుండీ లెక్కింపు :** స్వామి వారి హుండీ ఆదివారం లెక్కించగా రూ 5 లక్షల 94 వేల 645 రూపాయలు ఆదాయం వచ్చినట్లు చైర్మన్ హనుమంత రెడ్డి తెలిపారు. హుండీ ఆదాయం 3,54,830, కళ్యాణం చదివింపులు రూ.9,540, బ్రహ్మో త్సవముల చదిపింపులు రూ.1,57,680, సేవా టికెట్స్ రూ.50,725, షాపు కలెక్షన్స్ రూ.21, 870 మొత్తం రూ.5,94,645 వచ్చిందన్నా రు. ఈ కార్యక్రమంలో టెంపుల్ తనిఖీ అధికారి వెంకటేశ్వర్లు, పోలీసులు, దేవాలయ సిబ్బంది శ్రీనివాసులు, పండితులు, భక్తులు పాల్గొన్నారు.

స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న కార్యనిర్వణాధికారి చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ హనుమంత రెడ్డి

మహారాజశ్రీ కర్నూలు జిల్లా ఆదోని రెండవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

MVOP NO. 34/2022

యర్రగుడి పెద్ద కౌలుట్లయ్య అలియాస్ కురువ కౌలుట్లయ్య మరియు ఇతరులు. ...పిటిషనర్

వర్సెస్

పింజరి రఫీ మరియు ఇతరులు ...రెస్పాండెంట్

రెస్పాండెంట్ నెం.2కు నోటీస్

ది డివిజనల్ మేనేజర్
ఐసిఐసిఐ ల్యాంబాడ్ జనరల్
ఇన్సురెన్స్ కంపెనీ లిమిటెడ్, కర్నూలు.

పై నెంబర్ లో అర్జీదారుడు అయినా యర్రగుడి పెద్ద కౌలుట్లయ్యా అలియాస్ కురువ కౌలుట్లయ్య తనకు జరిగిన గాయములకు నష్టపరిహారం మూడు లక్ష రూపాయలు ప్రమాదం జరిగిన రోజు నుండి 18% ప్రకారం ఇప్పించమని కోరుతూ అర్జీ దాఖలు చేసినాను. ఇందులో 2వ రెస్పాండెంట్ అయినా మీరు 07-03-2024 న పగలు 10:30 గంటలకు పై కోర్టులో మీరు గాని మీ తరపున న్యాయవాది గాని హాజరై మీకు ఏమైనా ఆక్షేపనలు ఉన్నయెడల తెలుపుకొనలెను. లేనియెడల మీ పైన పరోక్షంగా పై అర్జీని విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వులు మేరకు

వాయిదా తేది : 07-03-2024

ఇ. శ్రీనివాస రెడ్డి
అర్జీపరం అడ్వకేట్,
పత్తికొండ

రుద్రవరం మండలం చిత్రేనిపల్లెలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎపిఓ

డోన్ టిడిపి రెబల్ అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డి..?

- తీవ్ర అసంతృప్తితో సుబ్బారెడ్డి అనుచరులు
- పోటీ చేయాల్సిందే అంటున్న క్యాడర్..
- కార్యకర్తల నిర్ణయమే ఫైనల్ అంటున్న నేత
- టిడిపికి భారీ మూల్యం తప్పదా..!

ప్రజాశక్తి - డోన్

ఈ నెల 24న ప్రకటించిన టిడిపి అభ్యర్థుల తొలి జాబితాలో డోన్ అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి పేరును చంద్రబాబునాయుడు ప్రకటించారు. గత కొంత కాలంగా డోన్ నియోజకవర్గంలో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించిన ధర్మవరం సుబ్బారెడ్డి రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థుల జాబితాలో డోన్ నుంచి టిడిపి అభ్యర్థిగా కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి పేరును టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించడం డోన్ టిడిపిలో ప్రకంపణలు సృష్టించింది. దాదాపు మూడు సంవత్సరాల క్రితమే టిడిపి అధినేత డోన్ అభ్యర్థిగా

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతో ధర్మవరం సుబ్బారెడ్డి (ఫైల్)

ధర్మారం సుబ్బారెడ్డి పేరును వేల మంది సమక్షంలో స్వయంగా ప్రకటించి నేడు మాట తప్పడంపై టిడిపి క్యాడర్ మండిపడుతోంది. మూడు సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడితే కూడా తమకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ సుబ్బారెడ్డి వర్గం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తుంది. చంద్రబాబు నిర్ణయం పై స్పందించిన ధర్మారం సుబ్బారెడ్డి కార్యకర్తల అభీష్టం మేరకే తన భవిష్యత్ కార్యచరణ ఉంటుందంటూ ప్రకటించారు. అయితే మెజార్టీ కార్యకర్తలు స్వతంత్రంగానే బరిలో దిగి పోటీ చేయాలని ధర్మారం సుబ్బారెడ్డి పై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఎన్నికలకు అన్ని విధాలా సంసిద్ధంగా ఉన్న సుబ్బారెడ్డి రెబల్ అభ్యర్థిగా బరిలో దిగి తన సత్తా చాటుకోవాలని సిద్ధమవుతున్నట్లు టాక్. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు బాధ్యతలు తీసుకొని నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేసిన సుబ్బారెడ్డికి టికెట్ దక్కకపోవడం పట్ల పార్టీ క్యాడర్ తో పాటు ప్రజల్లో కూడా సానుభూతి ఏర్పడింది. కొందరు టిడిపి ముఖ్యనాయకులు సుబ్బారెడ్డికి అన్యాయం జరిగిందని అంటున్నారు. ఆ సానుభూతి నే ఆయుధంగా చేసుకొని సుబ్బారెడ్డి రెబల్‌గా బరిలో దిగితే టిడిపి భారీ మూల్యం చెల్లించుకోవల్సి ఉంటుందని అంటున్నారు. త్వరలో నిర్వహించనున్న కార్యకర్తల సమావేశంలో ఆ మేరకు నిర్ణయం ప్రకటించి స్వతంత్రంగా ఎన్నికల్లో పోటీ చేస్తారని అనుకుంటున్నారు.

ప్రశాంతంగా గ్రూప్- 2 పరీక్ష

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో ఎపిపిఎస్‌సి గ్రూప్-2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 10:30 గంటల నుంచి 1 గంట వరకు గ్రూప్-2 పరీక్షలు జరిగాయి. జిల్లాలో 44 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు 14,670 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 12,478 మంది హాజరయ్యారు. 2,192 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి పరిశీలించారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని నేషనల్ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రానికి అభ్యర్థి ధరణి రెడ్డి 2 నిమిషాలు ఆలస్యంగా చేరుకోవడంతో అనుమతించలేదు. అలాగే మనోహర్ రెడ్డి ఒరిజినల్ ఆధార్ కార్డు తెచ్చుకోలేదని రిటన్ పంపారు. దీంతో అతను వెళ్లి తెచ్చుకునే సరికి రెండు నిముషాలు ఆలస్యం అవ్వడంతో లోపలికి అనుమతించలేదు. ఈ రెండు ఘటనలు మినహా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయి. **ఆళ్లగడ్డ :** ఆళ్లగడ్డ పట్టణంలో గ్రూప్- 2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అభ్యర్థులకు పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రజ్ఞ కళాశాల, సెయింట్ ఆన్స్ స్కూల్ తదితర కేంద్రాలలో పరీక్షలను నిర్వహించారు. పరీక్ష కేంద్రాలను ఆళ్లగడ్డ డిఎస్‌పి షేక్ షర్ఫుద్దీన్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

పిఆర్‌సి కోసం ఎదురుచూపులు

- వేతనాలూ సక్రమంగా అందవు - ఉపాధి హామీ సిబ్బంది దీన పరిస్థితి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే అందులో పని చేసే సిబ్బందికి వేతన వెతలు తప్పడం లేదు. ఉపాధి హామీ సిబ్బంది పిఆర్‌సి కోసం ఎదురు చూస్తున్నారు. దానికి తోడు వేతనాలు కూడా సక్రమంగా అందడం లేదు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా 548 మంది ఎపిఒలు, 11 మంది అడిషనల్ డిఆర్‌బిలు, 29 మంది కోర్సు డైరెక్టర్లు, 1406 మంది కంప్యూటర్ ఆపరేటరు, 238 మంది ఈసీలు, 183 మంది జెఇలు, 14 మంది డిబిటి, ఇతర 23 క్యాడర్లతో 6149 పని చేస్తున్నారు. అదనపు ప్రోగ్రాం అధికారి (ఎపిఒ) ఉపాధి హామీ పథకాన్ని మండల స్థాయిలో పర్యవేక్షించే అధికారిగా ఉంటారు. అదనపు డిస్టిక్ రిసోర్స్ పర్సన్స్ సాఫ్ట్వేర్ సంబంధిత పర్యవేక్షణ చూస్తారు. కోర్సు డైరెక్టర్లు శిక్షణలో ఇస్తుంటారు. కంప్యూటర్ ఆపరేటర్లు పని చేసిన డాటా ఎంట్రీ చేయటం వంటి పనులు చేస్తుంటారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్, జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉపాధి పనులు పర్యవేక్షిస్తారు. సాంకేతిక సహాయకులు పనులు గుర్తింపు, కొలతలు చేస్తారు. ఉపాధి హామీ సిబ్బందికి గతంలో 2014లో పదో పిఆర్‌సిని అమలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు 11వ పిఆర్‌సిని ప్రకటించారు. పంచాయతీ రాజ్ శాఖ కింద ఉన్న డిఆర్‌డిఎలో పని చేసే సిబ్బందికి డిసెంబర్‌లో 11వ పిఆర్‌సిని అమలు చేస్తున్నారు. ఆ 11వ పిఆర్‌సి ఉపాధి హామీ సిబ్బందికి అమలు కావడం లేదు. అందుకు పలు నిబంధనలు అడ్డువస్తుండటంతో పాటు పిఆర్‌సి అమలుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఉపాధి హామీకి ఖర్చు చేస్తున్న నిధుల్లో 6 శాతం మాత్రమే ఉద్యోగుల వేతనాల కోసం ఉపయోగించుకునేం దుకు వీలుంటుంది. పిఆర్‌సి అమలు చేస్తే బడ్జెట్ సరిపోదన్న కారణంతో పిఆర్‌సిని అమలు చేయడం లేదు. దీంతో 11వ పిఆర్‌సి కోసం ఉపాధి హామీ సిబ్బంది ఎదురుచూస్తున్నారు. దానికి తోడు వేతనాలు కూడా సరైన సమయానికి అందడం లేదు. ఈ నెల వేతనం 22వ తేదీన ఖాతాల్లో జమ చేశారు. వేతనాలు సరైన సమయంలో చెల్లించకపోవడంతో ఉపాధి సిబ్బంది ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఇఎంఐలు, వైద్య ఖర్చులు, ఇతర ఖర్చుల కోసం సిబ్బంది అప్పులు చేయాల్సి వస్తోంది. వేతనం పడే వరకూ తీసుకున్న అప్పుకు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది.

పిఆర్‌సిని అమలు చేయాలి

ఉపాధి హామీ సిబ్బంది పిఆర్‌సి కోసం ఆశతో ఎదురు చూస్తున్నాం. పై అధికారులు మాతో పని చేయించడమే కాకుండా మాకు, మా పిల్లలకు కూడు, గూడు, గుడ్డ ఆరోగ్యం వంటి సదు పాయాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటారని జాలిగా ఎదురుచూపులు తప్పడం లేదు. పక్కనున్న శాఖలకు జీతాలు పెరుగుదల అయినప్పుడు మాకు అవుతాయని ఆశిస్తున్నా మాకు నిరాశే ఎదురవుతోంది. అధికారులు ఇప్పటికైనా మా కష్టాలను గుర్తించి 11వ పిఆర్‌సిని ప్రకటించాలని కోరుతున్నాము.

- పి.ప్రతాప్, ఎపిఒల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు.

బలపాలతిప్ప గ్రామంలో సోలార్ చెడిపోవడంతో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకును చూపుతున్న గ్రామ మహిళలు

దాహం.. దాహం...

- వేసవికి ముందే నీటి కష్టాలు - అడుగంటిన భూగర్భ జలాలు
- నీటి కోసం పల్లె ప్రజల ఇక్కట్లు - దృష్టి సారించని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలో వేసవికి ముందే ప్రజలకు నీటి కష్టాలు మొదలయ్యాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటాయి. ఎక్కడ చూసినా ఎండిపోయిన బావులు, మరమ్మతులకు గురైన చేతిపంపులు, తాగు నీటి ట్యాంకులు దిష్టిబొమ్మలుగా దర్శనమిస్తున్నాయి. నీటి సమస్య తీవ్ర రూపం దాల్చినా పాలకులు, అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టక పోవడంతో ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు.

కొత్తపల్లి మండలంలో 12 గ్రామ పంచాయతీలు, 18 మజరా గ్రామాలున్నాయి. మండలంలో దాదాపు 25 వేల వరకు జనాభా ఉంది. మండలంలోని కొన్ని గ్రామాల్లో వేసవికాలం వచ్చిందంటే నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సిన పరిస్థితి నెలకొంది. చుక్క నీటి కోసం ప్రజలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉంది. వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో పాటు ఎండాకాలం రాకముందే విపరీతమైన ఎండలు ఉండడంతో ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటాయి. పల్లెల్లో ఉన్న మంచినీటి ట్యాంకులు గ్రామస్తులకు పూర్తిస్థాయిలో నీరు అందించకపోవడంతో ప్రజలు రాత్రి, పగలు నీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పుడే ఇలా ఉంటే వేసవి కాలంలో నీటి కోసం ఇంకెన్ని కష్టాలు పడాల్సి వస్తుందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రతి సంవత్సరం వేసవిలో మండలంలో ఉన్న తాగునీటి సమస్య నివారణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చర్యలు తీసుకునేవారు. అయితే ఈ ఏడాది నేటికీ కూడా అలాంటి నిధులు మంజూరు చేయలేదు. మరోవైపు తాగునీటి కోసం ఉపయోగించే మోటర్లకు మూడు లైన్ల కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉంది. ఉన్న కరెంటు సరాఫరాలో కూడా కోతలు ఉండడంతో అన్ని గ్రామాల్లో ఈ ఏడాది నీటి కష్టాలు తప్పవని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో కుళాయిల వద్ద నీటి కోసం పలుమార్లు మహిళలు ఘర్షణలు పడుతూ పోలీస్ స్టేషన్‌ల దాకా కూడా చేరిన పరిస్థితి ఉంది.

ఇప్పటికే బలపాల తిప్ప గ్రామంలో మొదలైన నీటి కష్టాలు

జిల్లా అధికారులకు దూరంగా, అటు అడవులకు, ఇటు కృష్ణానది మధ్యలో ఉంది బలపాల తిప్ప మజరా గ్రామం. గ్రామంలో జనాభా 150 మంది ఉన్నారు. ఈ గ్రామంలో ఇప్పటికే నీటి కష్టాలు మొదలయ్యాయి. సుమారు నీటి సమస్యతో పది రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు నీటి సమస్యను విన్నవించినా స్పందన లేదు. గ్రామంలో సోలార్ ద్వారా మంచినీటి ట్యాంకులకు నీటిని ఎక్కించుకునే పరిస్థితి ఉంది. ఆ సోలార్‌లు చెడిపోవడంతో నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను అధికారులు పరిష్కరించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

కొత్తపల్లి మండలంలో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటాం. జిల్లా అధికారులతో మాట్లాడి ఏ గ్రామంలో నీటి సమస్య ఉంటే అక్కడ వెంటనే పరిష్కరిస్తాం. తాగునీటి ఎద్దడి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయించి పుష్కలంగా తాగునీరు ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటికే కొన్ని గ్రామాల్లో నీటి సమస్యను గుర్తించి జిల్లా అధికారులతో చర్చించాం.

- కుసుమలత, ఎంపిపి.

చేతిపంపులోనూ అరకొరగానే నీరు వస్తోంది

మా గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కారం చేయాలి. నీటి సమస్యను అధికారులకు తెలిపినా ఫలితం లేదు. గ్రామంలో మనుషులతో పాటు పశువులకు కూడా నీటిని తెచ్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గ్రామంలో ఉన్న చేతి పంపు బోరు నుంచి నీటిని కొట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ చేతిపంపులో కూడా నీరు అరకొరగా అందుతుంది.

- బయన్న, బలపాల తిప్ప గ్రామం.

2 కిలోమీటర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం

మా గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జానాలగూడెం వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నాం. గ్రామంలో ఉన్న సోలార్‌లు చెడిపోవడంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నీటి సమస్యపై అధికారులకు విన్నవించినా ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ మా గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదు. మా గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించి ఆదుకోండి సారూ..

- వెంకటేశ్వర్లు, బలపాల తిప్ప గ్రామం.

టిడిపిలో చేరిన వారితో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

నాయకత్వంపై నమ్మకంతోనే వలసలు

- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - చాగలమర్రి

భూమా నాయకత్వంపై నమ్మకంతోనే వైసిపిని వీడి టిడిపిలోకి వలసలు వస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయనని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. ఆదివారం మండలంలోని రాంపల్లె గ్రామానికి చెందిన రామలక్ష్మి రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రసాద్ రెడ్డి, కోలిరెడ్డి, వెంకటరామిరెడ్డి, భయపరెడ్డి విజయ రామరెడ్డి, అంకాల రెడ్డి, శివారెడ్డిలతోపాటు మరో 20 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వీరికి మాజీ మంత్రి అఖిలప్రియ కండువాలు కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అందరూ కలిసికట్టుగా పనిచేస్తే అనుకున్నది సాధిస్తామన్నారు. శోభా నాగిరెడ్డి, భూమనాగిరెడ్డిలు కార్యకర్తలకు చిన్న ఆపద వచ్చినా తక్షణం వాలిపోయేవారని, అదే పంథాలో తాము కూడా అండగా ఉంటామన్నారు.కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నరసింహారెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్‌అన్సర్ భాష, జిల్లా మైనార్టీ నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి, కొలిమి మాబు షరీఫ్, ముల్లా అజీమ్, ముల్లా గఫార్, నూర్ భాషా, హనీఫ్, అబ్దుల్లా, జెట్టి నాగరాజు, ముల్లా అజిముద్దీన్, కరిముల్లా, బషీర్, ఆకుల ఇర్షాద్, కొలిమి షబ్బీర్, కొలిమి అష్రాఫ్ ,ఛామల్ మా భాష, శేఖర్ రెడ్డి, సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, భూషణం తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో ధర్మపురం పీఠాధిపతి

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను తమిళనాడు మయిలడుతురైకి చెందిన ధర్మపురం ఆధీన పీఠాధిపతి పరమాచార్య స్వామిగల్ ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ముందుగా ఆలయ రాజగోపురం వద్ద ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతికి శేష వస్త్రాలు, లడ్డు ప్రసాదాలను ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎం.హరిదాసు అందజేశారు.

పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

నేడు రైతు నిరసన ప్రదర్శన

- ప్రపంచ వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకించాలి
- ఢిల్లీ సరిహద్దు రైతు ఉద్యమాలకు మద్దతు
- ఎపి రైతు, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ

ప్రజాశక్తి - నంద్యాల

దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రవేశపెట్టిన ప్రతిపాదనలను నిరసిస్తూ నేడు సోమవారం రైతు నిరసన ప్రదర్శనలు చేపట్టాలని ఎపి రైతు, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ నాయకులు తెలిపారు. ఎపి రైతు, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నంద్యాల పట్టణంలోని టి.నరసింహయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు, కౌలు రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు ఎ.రాజశేఖర్, సుధాకర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెఎండి.గౌస్‌లు మాట్లాడారు. దోహా నగరంలో ప్రపంచ వాణిజ్య సంస్థ సమావేశం జరుగుతుందని, ఈ నేపథ్యంలో వాణిజ్య సంస్థ ప్రతిపాదనలను నిరసిస్తూ రైతులు నిరసన ప్రదర్శనలు చేపట్టాలని కోరారు. వాణిజ్య సంస్థ ప్రతిపాదనలు వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని విమర్శించారు. ఆహార భద్రత చట్టాన్ని నిర్వీర్యం చేయాలని ఈ ప్రతిపాదనలు సూచిస్తున్నాయని దుయ్యబట్టారు. డబ్ల్యుటిఒ వివిధ దేశాల ప్రభుత్వాలను పంటల కొనుగోలు కేంద్రాలను రద్దు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరను రద్దు చేయాలని ఆదేశిస్తుందని, ఈ ఆదేశాలను భారతదేశం లాంటి వ్యవసాయం మీద ఆధారపడిన దేశాలన్నీ తిరస్కరించాలని కోరారు. గత కొన్ని రోజులుగా హర్యానాలో జరుగుతున్న రైతు ఉద్యమాల్లో ఐదుగురు రైతులు తమ ప్రాణాలను కోల్పోయారని, దీనికి కారణమైన హర్యానా ప్రభుత్వంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పంజాబ్ సరిహద్దులో ఈ ఘాతుకానికి పాల్పడిన కేంద్ర బలగాలు, రాష్ట్ర బలగాలకు ఆదేశాలు జారీ చేసిన హర్యానా ముఖ్యమంత్రిపై, హోంమంత్రిపై, కేంద్ర హోంమంత్రిపై కేసులు నమోదు చేయాలని పంజాబ్ ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి రైతులపై కేంద్ర బిజెపి ప్రభుత్వం తీవ్రమైన దమనకాండను కొనసాగిస్తుంటే నోరు మెదకపోవటం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రైతులపై కేంద్రం దమనకాండను ఖండించాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే రాబోయే ఎన్నికల్లో రైతు ఉద్యమం సెగతో నిరసన వ్యక్తం చేయని రాజకీయ పార్టీలకు రైతులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. దేశవ్యాప్త రైతు నిరసన ప్రదర్శనలో భాగంగా నంద్యాల జిల్లాలో నియోజకవర్గ కేంద్రాల్లో రైతు, కార్మిక, ఇతర ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టాలని కోరారు. అంతకుముందు రైతు ఉద్యమంలో అమరులైన వారికి ఒక్క నిమిషం మౌనం పాటించి జోహార్లు అర్పించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శులు వి.బాల వెంకట్, డి.లక్ష్మణ్, రైతు సంఘం నాయకులు సురేష్, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ నాయకులు

కోట్లాది రూపాయలతో అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేసినట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని యనకండ్ల గ్రామంలో 41 లక్షల రూపాయలతో వేసిన సిసి రోడ్లను, 3 లక్షల రూపాయలతో నిర్మించిన అంగన్వాడి కాంపౌండ్ ప్రహరీ గోడను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో, నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కులమతాలకు, పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల కోసం కష్టపడి పనిచేసే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిఇ నాగ శ్రీనివాసులు, ఏఈ మహేష్ , వైసిపి నాయకులు కోడూరు రామచంద్రారెడ్డి, సాదుల శివ శంకర్ రెడ్డి, బొబ్బల రాజశేఖర్ రెడ్డి, బొబ్బల మహేశ్వరరెడ్డి, సంజీవ గౌడ్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

గ్రామీణ పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం

- ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - సంజామల

గ్రామీణ ప్రాంత పేదల కోసమే పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కార్పొరేట్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని నంద్యాల శ్రీ గురురాఘవేంద్ర బ్యాంకు కోచింగ్, విద్యా సంస్థల అధినేత చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి అన్నారు. ఆదివారం సంజామల మండలం మంగంపల్లె గ్రామంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో 41వ ఉచిత మెగావైద్య శిభిరంపెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో గుండె జబ్బులు, బిపి, షుగరు, మోకాళ్ళ నొప్పులు, కంటి వ్యాదులు, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీలకు సంబందించిన వ్యాదులు, చెవి, ముక్కు, గొంతు, దంత, చర్మవ్యాదులకు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ నంద్యాల, కర్నూలు పట్టణానికి చెందిన అనుభవజ్ఞులైన డాక్టర్లతో వైద్య బృందంతో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయిస్తున్నామని అన్నారు. వైద్య శిబిరానికి హాజరైన ప్రజలందరికీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత భోజనం ఏర్పాటు చేశామని చెప్పారు. పేద ప్రజలు ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవడం సంతోషాన్ని కలిగిస్తుందని అన్నారు. శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి మాట్లాడుతూ మా అబ్బ జ్ఞాపకార్థం పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ పేరున మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కోవెలకుంట్ల, సంజామల మండలం పరిసర ప్రాంత ప్రజలందరూ శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందారు.

మంగంపల్లిలో స్త్రీలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

ఆత్మకూరులో ముస్లిం మైనార్టీలను తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

వైసిపి నుండి టిడిపిలోకి చేరిక

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంలోని ఆరో వార్డులో వైసిపికి చెందిన పలువురు ముస్లిం మైనార్టీలు, దాదాపు 50 కుటుంబాల వారు ఆదివారం తెలుగుదేశం పార్టీలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సమక్షంలో చేరారు. అలాగే ఆత్మకూరు మండలం కరివేన గ్రామంలో దళిత కుటుంబాలకు చెందిన 70 మంది వైసిపిని వీడి టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పార్టీ కండువాలు వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పాలనలోనే ముస్లిం మైనార్టీలు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందారని, నాడు ప్రవేశపెట్టిన పథకాలన్నీ వైసిపి ప్రభుత్వం తొలగించిందన్నారు. దళితుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను కూడా ఈ ప్రభుత్వం తొలగించిందన్నారు. రాబోవు ఎన్నికల్లో శ్రీశైలం నియోజవర్గంలో టిడిపి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

'సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం'

ప్రజాశక్తి - బేతంచెర్ల : సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరం లాంటిదని బేతంచెర్ల ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన ప్రత్యేక చొరవతో మంజూరయిన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఏడు మంది బాధితులకు వారు ఆదివారం పంపిణీ చేశారు. మొత్తం రూ. 11 లక్షల 46 వేలు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ కాజా హుస్సేన్, వైసిపి సీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, మాజీ మద్దిలేటి స్వామి చైర్మన్ బీరవలి నాగేశ్వర రెడ్డి, నాయకులు గూని నాగరాజు, కౌన్సిలర్ జస్వంత్ రెడ్డి, మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వర రెడ్డి, సచివాలయాల టౌన్ కన్వీనర్ దక్కి శేఖర్, గొర్లగుట్ట మాజీ సర్పంచ్ సుధాకరప్ప, బుగ్గన గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి

డిఎస్పిని సన్మానిస్తున్న దృశ్యం

ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరం : డిఎస్పి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల వల్ల శారీరక , మానసిక ఉల్లాసం కలుగుతుందని ఆళ్లగడ్డ డిఎస్పీ షేక్ షర్ఫుద్దీన్ పేర్కొన్నారు. ఆళ్లగడ్డలోని రోటరీ ఆరోగ్య వేదిక వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన జోష్ ఆళ్లగడ్డ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైద్యుడు డాక్టర్ ప్రసాద్, ఆరోగ్య వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ రాంగోపాల్ రెడ్డిలు ఫ్లాష్ థెరపీ, యోగాలో మెళకువలను వివరించారు. అనంతరం డిఎస్పీ షర్ఫుద్దీన్‌ను రోటరీ క్లబ్ సెక్రెటరీ రామకృష్ణారెడ్డి, సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రమాదేవి, మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి వాము దగ్ధం - రూ. లక్ష ఆస్తినష్టం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని ఎ.కోడూరు గ్రామానికి చెందిన దానమయ్యకు చెందిన గడ్డివాము ఆదివారం దగ్ధమైంది. గడ్డివాము విలువ దాదాపు లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు తెలిపారు. పశువుల మేత కోసం నిలువ ఉంచుకున్న గడ్డివాము దగ్ధం కావడంతో దానమయ్య కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకున్నాడు.

యాగంటి రెడ్డి ఆర్థిక సహకారంతో వీల్ చైర్ పంపిణీ

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె పట్టణ కొండపేటలోని పింజరిపేటకు చెందిన ఖాజా హుస్సేన్‌కి మానవతా సేవా సంస్థ అధ్యక్షులు, ప్రముఖ పారిశ్రామికవేత్త దొనపాటి యాగంటి రెడ్డి వీల్ చైర్‌ను ఆదివారం పంపిణీ చేశారు. ఖాజా హుస్సేన్‌కి కిడ్నీలు చెడిపోయి నడవలేని స్థితిలో ఉండడంతో వీల్ చైర్ అందించాలని పూల అల్తాఫ్ దొనపాటి యాగంటి రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన దొనపాటి యాగంటి రెడ్డి ఖాజా హుస్సేన్ కుటుంబ సభ్యులకు వీల్ చైర్‌ను అందించారు. ఖాజా హుస్సేన్ కుటుంబ సభ్యులు దొనపాటి యాగంటి రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా దొనపాటి యాగంటి రెడ్డి మాట్లాడుతూ తన స్నేహితుడు అల్తాఫ్ ఖాజా హుస్సేన్ సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే వీల్ చైర్‌ను అందించినట్టు తెలిపారు. ఎవరైనా వికలాంగులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వారికి కూడా ట్రైసైకిల్, వీల్ చైర్ అందజేస్తామన్నారు.

వీల్ చైర్‌ను పంపిణీ చేస్తున్న ధోనపాటి యాగంటి

సుదర్శన హెూమం నిర్వహిస్తున్న దృశ్యం

అహోబిల క్షేత్రంలో భక్తుల రద్దీ

- నరసింహ మాలదారుల దీక్ష విరమణ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నల్లమల అరణ్యంలో వెలసిన ఎగువ అహెూబిల క్షేత్రంలో కొలువైన మాలోల నరసింహస్వామి సన్నిధిలో నరసింహస్వామి మాలదారుల సమక్షంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో సుదర్శన హెూమం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ హెూమంలో నరసింహ స్వామి దీక్ష తీసుకున్న భక్తులు మండలదీక్ష కాలం అనంతరం మాలోల సన్నిధిలో సుదర్శన హెూమంలో పాల్గొని నరసింహ స్వామి దీక్ష విరమించారు. దీక్షా విరమణకు ఆంధ్ర రాష్ట్రం నుండే కాకుండా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. ఎగువ అహెూబిలంలో నరసింహస్వామి దీక్షా విరమణకు వచ్చిన భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ గావించారు.

మేడిపండులా జగన్ పాలన : కాంగ్రెస్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగన్ పాలనలో సంక్షేమం మేడిపండు చందంగా తయారైందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జె.లక్ష్మి నరసింహ యాదవ్ ఎద్దేవా చేశారు. ఆదివారం నంద్యాల జిల్లా పార్లమెంట్ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26న అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్ర పునర్నిర్మాణ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసిసి జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ఏపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిలా రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యులు డాక్టర్ ఎన్ రఘువీరా రెడ్డి, గిడుగురుద్ర రాజు , ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఎపిసిసి ఇన్చార్జ్ మణికంఠాగూర్, ఏపీసీసీ ఇంఛార్జి సిడి మేయపన్‌లు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు, జిల్లా కార్యదర్శి ఆనంద్ రావు, అహ్మద్, సలాం తదితరులు పాల్గొన్నారు.

2న సిపిఐ ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి - నంద్యాల

మార్చి 2వ తేదీన కర్నూలులోని దేవి ఫంక్షన్ హాల్‌లో సిపిఐ ఉమ్మడి జిల్లా నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథిగా సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ పాల్గొంటున్నారని, ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు కోరారు. ఆదివారం నంద్యాలలోని సిపిఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇండియా కూటమి పోరాడుతుందన్నారు. మార్చి 2వ తేదీన కర్నూలులో జరిగే సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు తదితర నాయకులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి సోమన్న, నాయకులు శ్రీనివాసులు, భూమిని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి పాలనలోనే మైనార్టీల అభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

టిడిపి పాలనలోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కొండపేటలో చార్ కమాన్ మస్జీద్ కాంప్లెక్స్‌ను మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిలు ప్రారంభించారు. 3 లక్షల రూపాయల సొంత నిధులతో మసీదు సమీపంలో మూడు రూములను నిర్మించారు. ఈ రూములను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలతో 60 సంవత్సరాల నుండి తమ కుటుంబానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. నియోజకవర్గంలో ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నానని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రాగానే ముస్లింల సమస్యలన్నింటిని తీరుస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న షాదీఖానాలను పూర్తి చేసి, వారి ఆకాంక్షలను నెరవేరుస్తానని ప్రకటించారు. పట్టణంలోని కొండపేటలో చార్‌కమాన్ మస్జీద్‌కి చెందిన అసంపూర్తిగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ గదులను సొంత నిధులతో పూర్తి చేసినట్లు తెలిపారు. రంజాన్ తోఫా రద్దు చేసి పేద ముస్లింలకు పండుగ సంతోషాన్ని దూరం చేసిన సైకో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ ఉప సర్పంచ్ బురాన్‌ఫుద్దీన్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, మసీద్ కమిటీ సభ్యులు ఫన్నీ, చాంద్ బాషా, టిప్ టాప్ కలాం, అల్తాఫ్ హుస్సేన్, సయ్యద్ నియాజ్ హుస్సేన్, హమ్మద్ హుస్సేన్, సన్నీ. ముస్లిం మత పెద్దలు, ముస్లిం నాయకులు, మైనారిటీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మసీద్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

వార్డుల్లో పర్యటిస్తున్న మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్, కమిషనర్ హరిప్రసాద్ తదితరులు

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

- మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూర్ మున్సిపాలిటీ ప్రజలకు వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్ తెలిపారు. నీటి ఎద్దడి చర్యల్లో భాగంగా ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని ఆయా వార్డులలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా పర్యవేక్షణలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు వేసవికాలంలో తాగునీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకొని మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు కలిసి వార్డులలో పర్యటించి వెంటనే మంచినీటి పైపులైన్లు, చేతిపంపులు, బావులు, బోర్లు మైనర్ రిపేర్లు చేయించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని చెప్పారు. వార్డులలో పారిశుధ్యం, విద్యుత్ దీపాలు, సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలతోపాటు ముఖ్యంగా తాగునీటి సమస్యకు పరిష్కార మార్గం చూపే విధంగా అధికారులు, కౌన్సిల్ బృందం ముందుకు వెళుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హరి ప్రసాద్, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఏఈ బాషా, వైసిపి నాయకులు తిమోతి, రఫిక్, కౌన్సిలర్లు, మున్సిపల్ టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు

రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించండి : మాజీ మంత్రి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రానున్న ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదించాలని, నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధి చేస్తామని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. చంద్రబాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆళ్లగడ్డ పట్టణంలోని గాయత్రి నగర్, యేసునాధపురంలలో ఆమె ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి మాత అమ్మవారిని, పద్మనాభ స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి టిడిపి ప్రవేశపెట్టిన పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సిరివెళ్ల మండలంలోని జీనేపల్లి గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజధాని లేని ఏకైక రాష్ట్రంగా మన రాష్ట్రానికి పేరు తెచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానిదే అన్నారు. వైసిపి అరాచక అక్రమ పాలనను ప్రజలు అంతమొందించే రోజులు అతి దగ్గరలోనే ఉన్నాయన్నారు. తాగునీటి సమస్య ముంచుకొస్తున్నా ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని విమర్శించారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు పట్టణంలో ప్రారంభించిన తాగునీటి పథకాన్ని ఈ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందన్నారు. రాబోయే ప్రజాపోరులో టిడిపిదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిరివెళ్ల మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, తాలూకా యువ నాయకులు జగద్విఖ్యాత్ రెడ్డి, భార్గవరామ్ , కౌన్సిలర్ హుస్సేన్ భాష, రామాచారి, భాస్కర్ యాదవ్, బండారు శివ యాదవ్, మాజీ కౌన్సిలర్ రమీజాబి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న భూమా అఖిలప్రియ

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలోని సంజీవ్ నగర్ శ్రీ రామకృష్ణ విద్యాలయం 1978 ఎస్ఎస్‌సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆహ్లాదకర వాతావరణంలో కోలాహలంగా జరిగింది. 46 సంవత్సరాల తర్వాత బ్యాచ్ విద్యార్థులు డాక్టర్ రవి కృష్ణ, గెలివి రామకష్ణ, పాణ్యం ప్రభాకర్ రెడ్డి, కృష్ణమూర్తి, ఇసనకర్ర సత్యనారాయణ, లగిశెట్టి సురేష్ తదితరుల నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ రామకృష్ణ విద్యాలయంలో సమావేశమై ఆ బ్యాచ్‌కి చెందిన దివంగత మిత్రులు 24 మంది చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం సంజీవనగర్ రామాలయం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాఠాలు బోధించిన పాఠశాల కరస్పాండెంట్ నివర్తి మోహన్ కుమార్, నరసింహారావు, మల్లికార్జునుడు, శ్రీరాములు, ఆంజనేయులు, రామ సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, శివరామయ్య, రామ్మూర్తి, సుబ్బరాయుడు, ఆశీర్వాదమ్మ గురువులకు ఆత్మీయ సత్కారం అందజేశారు. విద్యార్థినులు రమాదేవి, భ్రమరాంబ, డి.వి.లక్ష్మి, సుధామణి, నాగలక్ష్మి పద్మావతి, పుష్పలత, శశికళ తదితరులకు సాంప్రదాయ మహిళా సత్కారం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొజ్జ మురళీధరేంద్ర రెడ్డి, బొజ్జ మహేశ్వర్ రెడ్డి, ఉమా మహేశ్వర రావు, చాటకొండ సత్యం, పాండురంగయ్య, శివకుమార్, మల్లయ్యతో పాటు అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ రామకృష్ణ విద్యాలయం 1978 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పార్టీ విజయానికి కృషి చేయాలి

- శ్రీశైలం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

రానున్న శాసనసభ ఎన్నికల్లో శ్రీశైలం నియోజకవర్గం నుండి టిడిపి జెండా ఎగరవేయాలని, అందుకు కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో కృషి చేయాలని శ్రీశైలం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి కోరారు. బండ ఆత్మకూరు మండల నాయకులు ఆదివారం టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకమై పనిచేసి టిడిపి విజయం కోసం కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తుందని, శ్రీశైలం నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు మల్లేశ్వర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు నందిపాటి నరసింహారెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ మనోహర్ చౌదరి, బూత్ కమిటీ కన్వీనర్ కే చిన్న లింగారెడ్డి, మైనార్టీ నాయకుడు జాకీర్ ఖాన్, జాలె నందయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీశైలం నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డిని అభినందిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మున్సిపల్ కార్మికుడు మృతి

- సిపిఎం, ప్రజా సంఘాల నివాళి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మున్సిపల్ కార్మికుడు సుగులూరు భాస్కర్ ఆదివారం మృతి చెందాడు. విషయం తెలిసిన సిపిఎం, ప్రజానాయకులు ఎం నాగేశ్వరావు, కె.భాస్కర్ రెడ్డిలు ఆయన స్వగృహానికి వెళ్లి భాస్కర్ మృతదేహానికి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపల్లి మండలం వడ్ల రామాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, శాంతమ్మల రెండో కుమారుడు భాస్కర్ నందికొట్కూరు గ్రామపంచాయతీలో 1994లో పారిశుధ్య కార్మికుడిగా చేరి, సిఐటియు జెండా పట్టి, కార్మికుల హక్కుల కోసం పోరాడారని తెలిపారు. భాస్కర్ ఆశయాలను సాధించిన రోజే ఆయనకు నిజమైన నివాళులు అర్పించిన వాళ్లమవుతామన్నారు. నివాళ్లులర్పించిన వారిలో నాయకులు పకీర్ సాహెబ్, గోపాలకృష్ణ, నాగన్న, ఆంజనేయులు, కర్ణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరమేష్, ఖాజా బాషా తదితరులు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

పశువుల కోసం కుందూకి నీరు విడుదల చేయాలి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని పశువుల దాహార్తి తీర్చేందుకు కుందూ నదికి నీటిని విడుదల చేయాలని బండి ఆత్మకూరు ప్రజాప్రతినిధులు నంద్యాల మున్సిపాలిటీ అధికారులను కోరారు. నంద్యాల మున్సిపాలిటీ తాగునీటి అవసరాల కోసం తెలుగు గంగ నుండి మున్సిపాలిటీ కమిషనర్ నిరంజన్ రెడ్డి, మున్సిపాలిటీ ఈఈ రమణమూర్తి, డిఈ శ్రీనివాసరెడ్డిలు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో కెసి కెనాల్ ద్వారా 150 క్యూసెక్కుల నీటిని తరలించారు. విషయం తెలిసిన బండి ఆత్మకూరు మాజీ మండలాధ్యక్షుడు దేశు వెంకట్రాంరెడ్డి, కాకునూరు మాజీ సర్పంచ్ జక్కం శివారెడ్డి, బండి ఆత్మకూరు ఉపసర్పంచ్ అవుటాల నాగేశ్వర్ రెడ్డి, కాకునూరు సర్పంచి నర్ల మహేశ్వర్ రెడ్డి, శివరాం రెడ్డి, చెదుల్ల శివరాం రెడ్డి తదితరులు రైతులతో కలిసి పశువుల తాగునీటి కోసం కుందూనదికి 10 క్యూసెక్కుల నీటిని వదలాలని అభ్యర్థించారు. అధికారులు మాట్లాడుతూ నంద్యాల ప్రజల తాగునీటి అవసరాల కోసం ఈ నీటిని ప్రభుత్వం ద్వారా మాట్లాడి విడుదల చేయించామన్నారు. పశువులకు, మేకలకు, గొర్రెలకు వేసవికాలంలో తాగునీటి అవసరం ఉందని, ప్రస్తుతం నంద్యాల ప్రజల దాహార్తిని గుర్తించాలని, రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమం లో బండి ఆత్మకూర్ కాకునూరు, పార్లపల్లి రైతులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న నంద్యాల మున్సిపాలిటీ డిఇ

దేశెట్టి శ్రీనివాస్ దంపతులకు సన్మానం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : ఇంటర్నేషనల్ ఫీస్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన దేశెట్టి శ్రీనివాసులు, దేశెట్టి సుమలత దంపతులను శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ అభివృద్ధి కమిటీ వారు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేశెట్టి శ్రీనివాసులు చిత్రలేఖనంలో ఎన్నో అవార్డులు అందుకోవడమే కాకుండా పిల్లలకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చి 300కు పైగా గోల్డ్ అండ్ సిల్వర్ మెడల్స్ రాష్ట్రస్థాయిలో వారికి వచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ అభిశిద్ధి కమిటీ ప్రెసిడెంట్ చింతా రామఖీష్ణ, సెక్రటరీ వీరనాల్ల ప్రసాద్, ట్రెజరర్ పాణ్యం నాగరాజు, సభ్యులు నాయకుల కృష్ణ, శ్రీరాములు, జయరాముడు, రమణ, మహిళా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దేశెట్టి శ్రీనివాసులు దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

నంద్యాల రచయితకు రాయల సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - నంద్యాల

శ్రీ సత్యసాయి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెనుగొండలోని గగన్ మహల్‌లో నంద్యాల రచయిత కొప్పుల ప్రసాద్ రాయల సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో అయనకు సన్మానం చేశారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్ బాషా, ఉమర్ షారుక్ ఖాన్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం గ్రహీత చదువుల బాబు, పెనుగొండ పుర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొప్పుల ప్రసాద్‌ను నంద్యాలకు చెందిన కళాభిమానులు, సాహిత్య ప్రియులు, సాహితీ సంఘాల ప్రతినిధులు డాక్టర్ రవికృష్ణ, విశ్రాంత శాస్త్రవేత్త రవీంద్రనాథ్, లాయర్ రామచంద్రరావు, డాక్టర్ గెలివి సహదేవుడు, శ్రీనివాసమూర్తి, అన్నెం శ్రీనివాసరెడ్డి, నరేంద్ర, మాబుబాషా తదితరులు అభినందించారు.

ప్రారంభం అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

జనని కోపరేటీవ్ సొసైటీ బ్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని శివరాం టాకీస్ సమీపంలో జనని మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ సొసైటీ బ్యాంక్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నందవరం బాలయ్య, కోవెలకుంట్ల సుబ్బయ్య, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

మహానందిలో కంచి పీఠాధిపతులు

ప్రజాశక్తి - మహానంది : లోక కళ్యాణార్థం విజయయాత్రలో భాగంగా ఆదివారం ఉదయం మహానంది క్షేత్రాన్ని కంచి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి, వేదపండితులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతులు క్షేత్రంలోని అభిషేక మండపంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు పీఠాధిపతులు భక్తులకు ప్రవచనాలు వినిపించారు. సోమవారం ఉదయం విజయేంద్ర సరస్వతి స్వామి క్షేత్రంలోని మహానందీశ్వరునికి విశేష అభిషేకం, కామేశ్వరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు చేయనున్నారు.

సుబ్బారాయుడు స్వామి సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి - పాణ్యం : ప్రముఖ శైవక్షేత్రం కొత్తూరు సుబ్బరాయుడు స్వామి వారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, మంత్రాలయం శాసనసభ్యులు బాల నాగిరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి దేవస్థాన అధికారులు రామకృష్ణ, సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ స్వామి, సురేష్ శర్మ, వీరయ్య స్వామిలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వారిచేత స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు వికలాంగుల మహా ధర్నా

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : వికలాంగుల హక్కుల సాధన కోసం నేడు నందికొట్కూరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వికలాంగుల హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు మలిరెడ్డి నాగన్న తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ మహా ధర్నా కార్యక్రమంలో వికలాంగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్ కోశాధికారి శేషమ్మ, సంఘ సభ్యులు సరస్వతి, షేక్షావలి, నాగరాజు నాగమద్దిలేటి పాల్గొన్నారు

శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం

ప్రజాశక్తి- శ్రీశైలం : శ్రీశైలం క్షేత్రాన్ని సందర్శించే యాత్రికులకు, భక్తులకు దేవస్థానం అందిస్తున్న నిత్య అన్నదాన పథకానికి ఆదివారం గుంటూరు జిల్లా జొన్నలగడ్డకు చెందిన శ్రీకాంత్ రూ. 1,00,116లు విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు ఎ.నాగరాజుకు అందజేశారు. దాతకు శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

నేడు 'జగనన్నకు చెబుదాం - స్పందన'

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నేడు సోమవారం నంద్యాల పట్టణం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జగనన్నకు చెబుదాం- స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమానికి నేడు ఉదయం 9-30 గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మల్లెవేములలో నీటి ఎద్దడి

- ట్యాంకర్లతో టిడిపి నాయకులు నీటి సరఫరా

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని మల్లెవేముల గ్రామంలో నీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటడంతో కుళాయిలకు నీటి సరఫరా జరగడం లేదు. గంటల తరబడి కుళాయిల వద్ద నిల్చున్నా నీరు అందడలేందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్పందించిన గ్రామంలోని టిడిపి నాయకులు నడిపిఓబయ్య, లక్ష్మి ఓబులేసు, వెంకటేశ్వర్లు, రామ, నాగరాజు, ఓబన్న, శ్రీరాములు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు. స్థానిక ఎస్సీ కాలనీలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసి ప్రజలకు నీటి అవసరాలను తీర్చారు.

నంద్యాల అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎస్ఎండి ఫారుక్ దరఖాస్తు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి షేక్ మాసుల్దార్ ఫారుక్ శనివారం విజయవాడలోనిఆంధ్ర రత్న భవన్‌లో తన దరఖాస్తు సమర్పించారు. ఆదివారం నంద్యాల డీసీసీ లక్ష్మి నరసింహ యాదవ్‌కు కూడా అందజేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నంద్యాల నియోజవర్గం నుండి పోటీ చేయడానికి అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నానని ఫారూక్ తెలిపారు. కార్యక్రమంలో 35వ వార్డు ఇంచార్జి షేక్ మొహమ్మద్ రఫీ, కార్యకర్త సయ్యద్ అఖిల్, నాజిర్, శేఖర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అభివృద్ధికి కృషి : భరత్ శర్మ

ప్రజాశక్తి - నందికొట్కూరు : గ్రామీణ ప్రాంతాల్లోని పేదల విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తానని ప్రముఖ ఆస్ట్రాలజీ స్వామి సుంకేసుల భరత్ శర్మ తెలిపారు. 45 మంది విద్యార్థులను తన సొంత డబ్బులతో మాత శ్రీ గాయత్రి పీఠం ఆధ్వర్యంలో కార్పొరేట్ స్కూల్లో ఉన్నత చదువులను అందిస్తున్నారు. మిడుతూరు మండలం సుంకేసుల గ్రామంలోని 45 మంది పేద విద్యార్థులను గుర్తించి నందికొట్కూరులోని శ్రీ చైతన్య కార్పొరేట్ స్కూల్‌లో ఆదివారం ఆయన ఫీజులు కట్టారు. ఒక పేద విద్యార్థిని చదివిస్తే ఆ విద్యార్థి కష్టపడి చదివితే వేల కుటుంబాలకు జీవితాలను ఇస్తారన్నది తన నమ్మకమన్నారు.

రుద్రవరంలో పారువేట ఉత్సవాలు

ప్రజాశక్తి - రుద్రవరం : అహెూబిల లక్ష్మీనరసింహస్వామి పారువేట ఉత్సవాలు రుద్రవరంలో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామంలోని పలు తెలుపులపై కొలువుదీరిన ఉత్సవమూర్తులను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అర్చకులు మధు, సతీష్ భక్తులు అందించిన పూజా సామాగ్రిని స్వామివారికి సమర్పించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రమాదవశాత్తు కర్రలు పడి రైతుకు గాయాలు

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని చిలకలూరు గ్రామ సమీపంలో పంట పొలంలో పశుగ్రాసం తరలిస్తుండగా పైనున్న కర్రలు రైతుపై తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు ముల్లా షరీఫ్ ఆదివారం తన పొలంలో జొన్న పంట పశుగ్రాసాన్ని ఎడ్ల బండికి వేసి ఇంటికి తీసుకువస్తుండగా మార్గ మధ్యలో పశుగ్రాసం పై భాగంలో వేసిన కర్రలు ప్రమాదవశాత్తు రైతు తలపై పడ్డాయి. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది అక్కడికి చేరుకొని రైతుకు ప్రథమ చికిత్స అందించి నంద్యాల ప్రభుత్వాసుపత్రికి రైతును తరలించారు.

నందికొట్కూరు బిఎస్‌పి అభ్యర్థిగా గద్దల లాజర్

ప్రజాశక్తి - నందికొట్కూరు : నందికొట్కూరు నియోజకవర్గ బిఎస్‌పి పార్టీ అభ్యర్థిగా గద్దల లాజర్‌ను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఆదివారం స్థానిక విలేకరులతో గద్దల లాజర్ మాట్లాడుతూ ఎంతోమంది కోటీశ్వరులు ఉన్న ఈ కాలంలో ఒక సామాన్య కార్యకర్త అయిన తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినందుకు బిఎస్పీ పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్క ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీలు తనను గెలిపించాలని కోరారు.

ఆల్మేవా డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నంద్యాల : ఆల్ మేవా ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్సీ సి.ఇసాక్ బాషా చేతుల మీదుగా ఆల్‌మేవా (ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్) 2024 డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆల్మేవా సామాజిక కార్యక్రమాలను అభినందించారు. పిఎంజెవికె స్కీంలో ఆరు భవన సముదాయాల కోసం ఆల్ మేవా కృషిని ఎమ్మెల్సీ కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు అబులైస్, అధ్యక్షులు ఇమ్రాన్ పాషా, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సలీం, జిల్లా వైస్ ప్రెసిడెంట్‌లు సైఫుల్లా, మాలిక్ బేగ్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ జాకిర్, నబి రసూల్, మహమ్మద్ రఫీ ఖాసిం, సనావుల్లా, మునీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరిస్తున్న దృశ్యం